పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య సిబ్బందికి పీపీఈ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి పీపీఈ కిట్లను ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అన్ని విధాలుగా ఉపయోగపడేలా శానిటైజర్, మాస్క్, గ్లౌజులు, సబ్బులు, నూనె తదితర వస్తువులతో కూడిన కిట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సూపర్ వైజర్లు కనకరాజు, మహేశ్, ఆగమయ్య, వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



తారానగర్‌లోని బోనాల వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్

శేరిలింగంపల్లి: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని తారానగర్‌లోని రేణుకాఎల్లమ్మ బోనాల వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఎల్లమ్మకు అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి కుమార్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు రాంచందర్, వీరేశంగౌడ్, మాణిక్యం, వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లన్నీ జలమయం





శేరిలింగంపల్లిలోని దోయన్స్‌కాలనీ ప్రధాన రోడ్డుపై పారుతున్న వరదనీరు

శేరిలింగంపల్లి: వర్షంతో రోడ్లన్నీ జలమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి శేరిలింగంపల్లి డివిజన్ ప్రాంతంలోని పలు కాలనీలు, బస్తీలలోని ప్రధాన, అంతర్గత రోడ్లపై వర్షపునీరు పారడంతో వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. కొందరు వాహనదారులు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు. చిన్న చిన్న వర్షాలకే భారీగా వరదనీరు రోడ్లపై పారడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

– కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

చందానగర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వేముకుంటలో ఉపకమిషనర్ శశిరేఖ, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి, ఏసీపీ నాగిరెడ్డి, ఎంటమాలజీ అధికారులతో కలిసి ఆమె శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. స్వచ్ఛ పారిశుద్ధ్య ఆటోలలోనే చెత్తను వేయాలన్నారు. కార్మికులు విధులకు రాకపోతే, సమస్యలు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రవీందర్‌రావు, లక్ష్మీనారాయణ గౌడ్, అక్బర్‌ఖాన్, యుసుఫ్‌ఖాన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పార్కింగ్ లాట్‌లోనే వాహనాలను నిలపాలి

మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి



బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్ వాకర్స్ తమ వాహనాలను నిర్దేశించిన ప్రాంతంలో పార్క్ చేయాలని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ట్రాఫిక్ పోలీసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్ ప్రధాన ద్వారం ఎదురుగా, వర్చువల్ సఫారీ పార్క్ వద్ద వాహనాలను పార్క్ చేసి లోపలికి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రధాన రహదారిపై రెండు వరుసలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతుందని, అడ్డదిడ్డంగా వాహనాలను పార్క్ చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జీబ్రా క్రాసింగ్, సిగ్నల్‌మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాకర్స్ ద్విచక్ర వాహనాలకు ఫుట్‌పాత్ పార్కింగ్‌లో సింగిల్ లేన్‌కు ప్రతిరోజు ఉదయం 8.30 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు అనుమతి ఇచ్చారని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, ఎస్ఐ రమేశ్, బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు భరత్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేలా ప్రోత్సహించాలి



జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం

శేరిలింగంపల్లి: విద్యార్థులను తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటేలా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.బల్వంత్‌రెడ్డి సూచించారు. పీఎం శ్రీ శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీఎం శ్రీ స్కీంలో భాగంగా స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.బల్వంత్‌రెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌లో గ్రీనరీ అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రతినిధి శేఖర్, ఉపాధ్యాయులు సి.లక్ష్మి, ఉదయకుమారి, దుర్గా భవాని, సూర్యప్రభ, కేశవరెడ్డి, వీరేశం, విజయ, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

చందనశ్రీకి యోగాసన పోటీల్లో కాంస్యం



హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని చందనశ్రీ

రాయదుర్గం: యోగాసన పోటీల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సత్తా చాటింది. సంగారెడ్డి జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసన పోటీల్లో క్యాంపస్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న చందనశ్రీ జిల్లా స్థాయిలో కాంస్య పతకం సాధించింది. దీంతో మంగళవారం స్కూల్‌లో ప్రిన్సిపాల్ మురళి, యోగా కోచ్ మట్టపల్లి సతీష్, అధ్యాపక బృందం ఆమెను అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగాసనలో చందనశ్రీ సత్తా చాటి కాంస్య పతకం సాధించడం హర్షనీయమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్

ప్రత్యేక సమావేశంలో విద్యార్థులకు కౌన్సిలింగ్

రాయదుర్గం: ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌ను తీర్చిదిద్దడంలో విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు భాగస్వాములు కావాలన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో ఎఫ్‌డీడీఐలోని విద్యార్థుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. ర్యాగింగ్‌పై జీరో టాలరెన్స్ విధానం, చట్టపరమైన చిక్కులు, క్యాంపస్‌లో పరస్పర గౌరవం, మద్దతును కొనసాగించాలని నిర్ణయించారు. కొత్తగా క్యాంపస్‌లో చేరిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి ఆదేశంపై ఈ సమావేశంలో ఈ కౌన్సిలింగ్ కార్యక్రమానికి యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల హక్కులు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాల విషయమై వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. తోటి విద్యార్థులను అందరూ గౌరవించాలన్నారు. ర్యాగింగ్ రహిత వాతావరణం ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ క్యాంపస్‌లో కొనసాగించేలా చేయడానికి అందరూ కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన రాయబారులుగా మారాలని ఫ్యాకల్టీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం ర్యాగింగ్ కమిటీ చైర్మన్, సభ్యులు విద్యార్థులతో ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌ను తీర్చిదిద్దడంలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన

స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్, స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగాల సందర్శన



హెచ్‌సీయూలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్‌లో లింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు సందడి చేశారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో మైక్రోస్కోపీ, ఫొటోనిక్స్, సెంట్రిఫ్యూగేషన్, ఎన్ఎంఆర్, టీఈఎమల్లో ఆచరణాత్మక ప్రదర్శనల ద్వారా సైన్స్ ప్రాధాన్యతను అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయస్సులోనే శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా, క్యాంపస్‌లోని నూతన ఆవిష్కరణలపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పర్యటనపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

తారానగర్‌లో ఘనంగా బోనాలు



తారానగర్‌లో బోనాల వేడుకల్లో కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, కుమార్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో రేణుకాఎల్లమ్మ బోనాల వేడుకలు కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్థానికులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, మెట్టు కుమార్‌యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, రాంచెంయదర్, లక్ష్మణ్, నారాయణ, పాండు ముదిరాజ్, పవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో ఫలహార బండి ఊరేగింపు

లింగంపల్లి విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుల మోతలు, యువకుల కేరింతలతో ఊరేగింపు కొనసాగింది. స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, నాయకులు కె.ఎల్లేశ్, రాఘవేంద్రరావు, రవియాదవ్, సోమయ్య యాదవ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.